అర్ధరాత్రి 12 గంటలకు 10 నిమిషాలే తక్కువ. ఊరంతా గాఢ నిద్రలో ఆదమరచి ప్రశాంతంగా ఉంది. కీచురాళ్ళరొద. ఎక్కడో కుక్కల అరుపులు, చల్లనిగాలుల అలలు ప్రకృతి నిండా ప్రతిధ్వనిస్తున్నాయి. సుప్రజకు ఎంత సేపటికీ నిద్రరావడంలేదు. నిరీక్షణలోనే నిమిషాలు గంటలుగా మారిపోతున్నాయి. ఒంటరితనం ఓ శాపంగా తోస్తోంది. ఆ నిర్మల నిశ్శబ్ద ప్రశాంత వాతావరణాన్ని చీలుస్తూ గోడగడియారం టిక్, టిక్ మంటూ చేసే శబ్దం తన గుండెలపై కొడుతూ బాధిస్తున్నట్లుంది. ఛీ... ఇక లాభం లేదు. ఈ మనిషి ఇక రాదు... చీటి




కందాళ సుదర్శన్

కీ మాటికీ చిన్న చిన్న విషయాలకు పోట్లాడి కోపంతో ఇలా వెళ్తే ఏం లాభం? అయినా నూతన దాంపత్యంలో ఇవన్నీ పరిపాటే అని అమ్మమ్మ చెప్పింది. తను మగాడు కాబట్టి అలా హాయిగా వెళ్ళగలిగాడు. మరి నేనెక్కడికి వెళ్లగలను? ఛీ... ఈ మగా ళ్ళంతా ఇంతే... అంతవరకూ తనొస్తాడు... బుజ్జగిస్తాడు... ఓదార్చి, లాలించి, బుజ్జగించి ఒళ్ళో చేర్చుకొంటాడు... అని ఆశగా ఎదురుచూసిన సుప్రజ నిరాశ, నిస్పృహ, నిరుత్సాహంతో నీరుగారుతూ బెడ్ రూమ్‌లోకెళ్ళి మంచంపై వాలిపోయింది.

కిటికీ తెరిచి బైటికి చూస్తే పుచ్చపువ్వులా విచ్చిన చల్లని తెల్లని వెన్నెల్లో విరిసిన పొగడ పారిజాత రాతికరాణిసుమాల వాసనలు గుప్పుమంటూ వచ్చి ముక్కు పుటాలను అదరగొడుతూ మనసును మత్తులో ముంచెత్తి మరో లోకాల్లో విహరింపజేస్తున్నాయి. దూరంగా చూస్తే పెద్ద పెద్ద వేప, చింత, రావి, మర్రి చెట్లు జడలు విరబోసుకొన్న కొరివి దెయ్యాలా కనిపిస్తున్నాయి. అసలే ఒంటరితనమంటేనే భయం... అందులో అర్ధరాత్రి... అనుకోగానే మనసు పొరల్లోని అంతరాంతరాలలో ఎక్కడో ఏదో తెలియని భయం... కంటి మీద కునుకు రావడం లేదు. ఒకవేళ అతను రాకపోతే? ఈ రాత్రి శివరాత్రే, పక్కవాటా వాళ్ళు ఆదమరచి హాయిగా నిద్రపోతున్నారు. మనస్సు నిండా ఏవేవో అడ్డమైన ఆలోచనలు... "మానస సంచరరే... అన్నట్లుగా మనస్సెక్కడెక్కడో తిరిగొస్తోంది. ఏవేవో ఊహలతో మనస్సు కీడుని శంకిస్తోంది. కోపం, ద్వేషం. పగ. కసి. చికాకు, చీదరింపు, అసహ్యం, అసహనం... అతనొస్తే మాట్లాడవద్దు... పోట్లాడాలి... రోజులు. నెలలు. కాదు... కాదు... సంవత్సరాల తరబడి మౌనపోరాటమే.

అంతలోనే ఎవరో తలుపు తట్టిన శబ్ధం. టక్...టక్...టక్... ఉలిక్కిపడిన సుప్రజ ఆనందంగా, ఆత్రంగా వెళ్ళి గట్టిగా ఎవరు? ఎవరు? అంది. మౌనమే రాజ్యమేలింది తప్ప మనిషి అలికిడి, ఆచూకి కనబడలేదు. పైకి చూస్తే ఆకాశంలో చందమామ మబ్బుల మాటు నుంచి మందహాసం చేస్తూ మబ్బులతో దోబూచులాడుతూ పరుగులు పెడుతున్నాడు. కిందంతా చెట్ల నీడలు, మసక చీకటి. సుప్రజ గుండె వేగంగా కొట్టుకొంటోంది. శిశిరం కావడం చేత రివ్వున వీచేగాలికి, ఎండిన చెట్ల ఆకులు టప్, టప్ అంటూ క్రింద రాలిపడుతున్న శబ్ధం. శరీరమంతా చెమటపట్టి ఆపాదమస్తకం వణుకు ప్రారంభమయింది. తలుపులన్నీ బంధించి, అమ్మానాన్నలను, అన్నయ్యనూ గుర్తు చేసుకొంటూ అంజనేయదండకం మననం చేసుకొంటూ ముడుచుకు పడుకుంది.

ఆమె శ్వాస ఆమెకే భయాన్ని గొల్పుతూ ఉంది. ఆ నిశ్శబ్దంలో ఢబేల్‌మనే పెద్ద శబ్ధం. సుప్రజ పైప్రాణాలు పైనే పోయాయి. కొద్దిగా ముసుగు తొలగించి చూసింది. తనను ఇలా చేసి వెళ్ళిన అతనిపై అమితమైన కోపం... కళ్ళముందుంటే కత్తితో కస్సునపొడిచి చంపెయ్యాలన్నంత కసి... అంతలోనే వంట గదిలో పాలు త్రాగేసిన పిల్లి మ్యావ్...మ్యావ్... అంటూ కళ్లు మిటకరిస్తూ సుప్రజవైపు కొంటెగా చూసి కిటికీలోనుంచి దూకివెళ్ళిపోయింది. సుప్రజకు ఏడుపొక్కటే తక్కువ. అంతలోనే ఓ బొద్దింక రయ్‌మంటూ ఎగిరి సుప్రజ మీదకి వచ్చింది. కెవ్వుమంటూ రెండు కళ్లూ మూసుకొని ముందు గదిలోకురికింది. మళ్ళీ తలుపు తట్టిన శబ్ధం...

ఎవరు? ఎవరు? నన్నెందుకిలా క్షణక్షణానికీ భయపెట్టి ఏడిపించి చంపుతున్నారు?

నేనే... సుప్రజా...నేనే... నీకేమైంది? అంటున్న రాకేష్ మాటలకు తలుపు తెరుస్తూ అమితమైన ఆనందంతో సుడిగాలిగా దూసుకెళ్లి రాకేష్ ఒడిలో పువ్వులా వాలిపోయింది. ●